# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## కాంగ్రెస్, బీజేపోళ్లను నమ్మేది లేదు

అబద్ధపు మాటలు చెప్పి రైతులను మోసం చేసే కాంగ్రెస్, బీజేపోళ్లను నమ్మేది లేదు. 24 గంటల కరెంటుపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నరు. కాంగ్రెసోళ్లు 3 గంటల కరంటు సాలంటున్రు, బీజేపోళ్లు మోటర్లకు మీటర్లు పెట్టాలని మాట్లాడుతున్నరు. 3 గంటల కరంటు ఎక్కడ సరిపోతదో కాంగ్రెసోళ్లు చెప్పాలి. మోటర్లకు మీటర్లు ఎందుకు పెడుతరో బీజేపోళ్లు చెప్పాలె. రాష్ట్రాన్ని, రైతులను ఆగం చేయడానికి కాంగ్రెస్, బీజేపోళ్లు మొపైంద్రు, వీళ్లను నమ్మి గిట్ల ఓటు వేస్తే ఇక మల్ల చీకటి రోజులు చూసుడు ఖాయమే.

**-రామిడి సురేందర్, తాడిజెర్రి (గంగాధర)**

## మోటర్లు కాలిపోతయ్..



కాంగ్రెస్ పాలనలో కరెంటు ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతుందో తెలియకపోయేది. తరచూ మోటర్లు కాలిపోయేవి. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ ప్రభుత్వం ఎవుసానికి 24 గంటలు కరెంటు ఇస్తున్నది. ఇప్పుడు ఆ సమస్య లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే రైతులంతా సంతోషంగా ఉంటరు. కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు కానీ, రాక ముందే ఎవుసానికి మూడు గంటల కరెంటు చాలంటున్నది. దీని కోసం 10 హెచ్‌పీ మోటర్లను వాడుకొమ్మంటున్నది. అది రైతులకు సాధ్యమైతదా?. వీళ్లకు అసలు ఎవుసం మీద అవగాహన ఉందా? గిసోంటోళ్లకు పాలన అప్పజెప్తే ఆగమవుడే.

**- కంది శ్యాంసుందర్ రెడ్డి, రైతు, అల్గునూర్(తిమ్మాపూర్)**

## ఇప్పుడు టార్చిలైట్లనే మర్చిపోయినం



తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చినంకనే రైతులకు మంచి రోజులు వచ్చినయ్. కరంటు కష్టాలు పూర్తిగా తీరినయ్. వ్యవసాయాన్ని ఉద్యోగంలా చేసుకుంటున్నం. మాకు వీలు ఉన్నప్పుడు పొలం వద్దకు పోతున్నం. కరంటు పెట్టుకొని పొలం పారినంక బంద్ చేసుకొని వస్తున్నం. గతంలో ఇంటికో టార్చిలైటు ఉండేది. ఇప్పుడు పొద్దంతా కరంటు ఉంటుందని టార్చిలైట్లనే మర్చిపోయినం. అలాంటిది మూడు గంటల కరంటు సరిపోతదని రేవంత్‌రెడ్డి అనడం అవివేకం. ఈ ప్రభుత్వం రైతులకు మంచి చేస్తున్నది. మళ్లీ ఇదే సర్కారును గెలిపించుకుంటేనే వ్యవసాయం నడుస్తది. లేకపోతే రైతులు ఆగమైతరు.

**- బండ శ్రీనివాస్, రైతు, పెద్దపాపయ్యపల్లి (హుజూరాబాద్ రూరల్)**

## కాంగ్రెసోళ్లకు కండ్లు ఓర్తలేవా..?



కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్‌రెడ్డి అన్ని పిచ్చి మాటలు మాట్లాడుతండు. 10హెచ్‌పీ మోటర్ పెడితే సరిపోతుందా. దానికి ట్రాన్స్‌ఫార్మర్ కావాలి. పైపులైన్లు తీయాలి. ఇవ్వన్నీ రేవంత్‌రెడ్డి ఇస్తాడా. ఒక్కొక్కరు 50నుంచి వరకు భూమిలో నుంచి పైప్‌లైన్లు వేసుకొని ఉన్నరు. వాటిని ఎలా తొలగిస్తారు. తెలంగాణ రాక ముందు గోస పడ్డాం. రైతులు సంతోషంగా ఉంటే కాంగ్రెసోళ్లకు కండ్లు ఓర్తలేవా..? పాత రోజుల్లాగా కరంటు కష్టాలు వస్తే రైతులు ఉరేసుకొని సచ్చిపోవాలే. రైతులకు అన్ని విధాలా మేలు చేస్తున్న ఈ ప్రభుత్వమే మంచిగుంది. మళ్లా ఈ సర్కారే రావాలని. కేసీఆరే సీఎం కావాలె.

**-తోకల రవీందర్‌రెడ్డి, సిర్సపల్లి, రైతు (హుజూరాబాద్ రూరల్)**

# మోటర్ల వద్ద పడిగాపులే

- కాంగ్రెస్‌కు అవకాశమిస్తే అంధకారమే
- మూడు గంటల కరెంట్‌తో మునుగుడే
- ఆ పార్టీని నమ్మేది లేదు.. ఓటేసేది లేదు
- 24 గంటల కరెంట్‌తోనే మాకు బతుకు
- కేసీఆర్ సారునే గెలిపించుకుంటం
- స్పష్టం చేసిన జిల్లా రైతులు

కరీంనగర్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్‌కు అవకాశమిస్తే మళ్లీ ఎనకటి రోజులే వస్తాయని, ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని కరెంట్ కోసం వ్యవసాయ మోటర్ల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని కర్షకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు వస్తున్న 24 గంటల ఉచిత కరెంట్ పోతుందని, మళ్లీ మూడు గంటలే దిక్కవుతుందని హెచ్చరిస్తున్నారు. నాడు నలభై రెండేండ్ల కాంగ్రెస్ పాలన, పదహారేండ్ల టీడీపీ పాలన చూశామని, యాభై ఎనిమిదేండ్ల సమైక్య పాలనలో ఎవరూ ఇవ్వలేని కరెంటును కేసీఆర్ మాత్రమే ఇచ్చారని స్పష్టం చేస్తున్నారు. ఆనాడు సాధ్యం కానిది ఇవ్వాళ ఎలా సాధ్యమైందంటే.. ఈ ప్రాంత రైతులపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమే కారణమంటున్నారు. సాగునీరు, 24 గంటల కరెంటు, రైతు బంధు, రైతు బీమా వంటివి ఇస్తూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా తమకు అండగా నిలుస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. డెబ్బై ఆరేండ్ల స్వతంత్ర దేశ చరిత్రలో.. నేటికీ ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు 24 గంటల కరెంటు ఇస్తున్నది కేసీఆర్ మాత్రమే అని ప్రశంసిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ నేతలు కరెంట్‌పై పూటకో మాట చెబుతూ పరేషాన్ చేస్తున్నారని, వారిని నమ్మితే మళ్లీ మోటర్ల కాడ జాగారం చేయక తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సద్ది తిన్న రేవు తలువాలంటే.. మనకు మేలు చేసిన వారికి అండగా నిలవాల్సిన అవసరముందని చెబుతున్నారు. కరెంట్, నీళ్లకు ఏబాధా లేకుండా చేసిన కేసీఆర్ వెంటే తాము ఉన్నామని స్పష్టం చేస్తున్నారు.



## కాంగ్రెస్‌కు ఓటద్దు.. ఆ కష్టాలు మాకద్దు

కాంగ్రెస్ వాళ్లకు ఓటేసి మల్ల కరెంట్ కష్టాలు తెచ్చుకోమంటారా? కేసీఆర్ సార్ సీఎం అయ్యాక మా రైతుల పొలాలకు నీళ్లు వచ్చినయ్. 24 గంటల కరెంటుతో మా రైతుల బతుకులు బాగుపడుతున్నయి. కాంగ్రెస్ వాళ్లు ఇచ్చే 3 గంటల కరెంటుతో ఓ మూలగూడ పారదు. మాకొద్దీ ఈ కాంగ్రెసోళ్ల వాళ్లకు ఓటేసుడద్దు.. అప్పటి కష్టాలు మాకద్దు. కేసీఆర్ సార్‌కే మా మద్దతు.

**- ఎల్కతుర్తి లక్ష్మణ్, రైతు, కొత్తపల్లి(తిమ్మాపూర్‌రూరల్)**



## కాంగ్రెసోళ్లవి బోగస్ మాటలు

అధికారం రాకముందే కాంగ్రెస్ నాయకులు బోగస్ మాటలు మాట్లాడుతున్రు . పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి భూయజమానులకు 15వేల రూపాయలు, కౌలు రైతులకు 12వేల రూపాయలు చొప్పున రైతుబంధు ఇస్తామని చెప్తున్నడు. ఈరోజు ఒకరికి ఇస్తే మరొకరికి ఇవ్వబోమని మాటమార్తరు. అట్లాంటోళ్లని నమ్మి ఓట్లెలా వేస్తాం. రైతులందరూ ఆలోచించి రైతుల పక్షాన ఉండే బీఆర్ఎస్‌కు ఓటెయ్యాలి. కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతులకు తిప్పలు తప్పవు.

**- కాశిరెడ్డి శంకర్‌రెడ్డి, రైతు, రాంపూర్ (హుజూరాబాద్)**

## కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తం



తెలంగాణ ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నది. పదేండ్ల నుంచి మంచిగ బతుకుతున్నం. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో లబ్ధి కోసం ఏవో మాయమాటలు చెబుతున్నరు. తెలంగాణల రైతాంగం 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లే వాడుతరు. 10 హెచ్‌పీ ఎవరు వాడరు. రేవంత్‌రెడ్డికి ఎవుసం మీద కనీసం అవగాహన లేక మాట్లాడుతున్నడు. 10 హెచ్‌పీ మోటర్ వాడితే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతది. రైతులు బాగుపడడం కాంగ్రెస్ నాయకులకు ఇష్టం లేనట్టుంది ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్తం.

**- నాగరాజు రైతు, మైలారం (గన్నేరువరం)**



## అచ్చిపోయే కరెంటుతోటి మోటర్లు కాలుతయ్

ఎన్కట ఎన్నిజూసినం. ఊళ్లల్ల కరెంటే లేకుండే. ఇప్పుడు కరెంటనేదే పోతలేదు. ఇగ కాంగ్రెసోళ్ల పద్ధతి సూత్తంటే మూడు గంటల కరెంటు సాలంటర. బుద్ధున్నోడు ఎవడైనా ఇట్లాంటరా..? మూడు గంటల కరెంటిస్తే భూములు బీళ్లుగా మారుతయ్. ఎన్కటి రోజులత్తయ్. అచ్చిపోయే కరెంటుతోటి మోటార్లు కాలిపోతయ్. ట్రాన్స్‌ఫార్మర్లు ఉండయ్. మేం జేసే కష్టమంతా ఖర్చులకే సరిపోతయ్. రైతుల మీద ఇంత కక్ష ఎందుకో కాంగ్రెసోళ్లకు. ఎవుసానికి 24గంటల కరెంటు ఉండాల్సిందే. ఇప్పుడిస్తున్న బీఆర్ఎస్‌ను ఎందుకు కాదనుకుంటం. రైతులను అన్ని విధాలా చూసుకుంటున్న కేసీఆర్‌కే మద్దతిస్తం. కాంగ్రెస్‌ను రానిచ్చేది లేదు.

**-గుర్రం నరేందర్‌రెడ్డి, రైతు, ఎల్లపల్లి(జమ్మికుంట)**



## కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునగడం ఖాయం

కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే నట్టేట మునగడం ఖాయం. మొన్నటికి మొన్న భూ యజమానులు, కౌలురైతులకు రైతుబంధు ఇస్తా మన్న రేవంత్‌రెడ్డి రెండ్రోజుల్లోనే మాటమార్చాడు. ఇప్పుడే రేవంత్‌రెడ్డి ఇట్లా మాట్లాడుతుంటే అధికారంలోకి వస్తే అందరికీ పంగనామాలు పెడుతాడు. కౌలు రైతులకు రైతుబంధు ఇవ్వడం అనేది పెద్దతప్పు. వాళ్లకు ఇస్తే హక్కుదారులై కూర్చుంటరు. దీనికి ప్రభుత్వం ఇస్తున్న రైతుబంధే సాక్ష్యం అయితది. కోర్టుకు వెళ్లే సమస్యలు తప్పవు. భూ యజమానికి ఇబ్బందులు మొదలవుతాయి. కేసీఆర్ ఇస్తున్న రైతు బంధు భేషుగ్గా ఉంది.

**-సురకంటి సదానందరెడ్డి, రైతు, రాంపూర్ (హుజూరాబాద్)**

## మీరొద్దు.. మీ కరెంటొద్దు



మూడు గంటల కరెంట్లా సాలుతదో చెప్పాలే. 24గంటల కరెంటు ఉంటేనే పొలాలు పారుతున్నయ్. ఇట్లనే ఉండాలే. మూడు గంటలతోటి మడి కూడా పారదు. మీరొద్దు. మీ కరెంటొద్దు. ఇంకా 10హెచ్‌పీ మోటర్లట. ఎందుకవి. ఇంకా మోటర్లకాడ మీటర్లు పెడ్తరట. ఎందుకు మేం బాగుండడం మీకు కట్టమైతందా ఏంది. బీఆర్ఎస్ తప్పా.. ఇక్కడ వేరే పార్టోళ్లు అచ్చేది లేదు. సచ్చేదీ లేదు. బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటం. మా కష్టాలన్నీ కేసీఆర్‌కు తెలుసు. 24గంటల కరెంటిస్తున్రు. పెట్టుబడి సాయం ఇయ్యబట్టే. బీమా ఉండే. నీళ్లు రావట్టే. ఇంకేంగావాలే.

**-కడిపికొండ సాంబశివరెడ్డి, రైతు, అంకుశాపూర్(జమ్మికుంట)**